క్లుప్తంగా

ప్లాస్టిక్ అనర్థాలపై కళాజాత

తెనాలి: ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో, మండలి రీజినల్ కార్యాలయం పర్యవేక్షణలో ఆదివారం ఉదయం పలు కూడలి ప్రదేశాల్లో కళాజాత నిర్వహించారు. సోమవారం పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సింగిల్ యూజ్ ప్లాస్టిక్, ప్లాస్టిక్ కవర్లు వాడకంతో జరిగే అనర్థాలను వివరిస్తూ గ్లోబల్ ఎన్విరాన్‌మెంటల్ స్టూడెంట్ ఎవేర్‌నెస్ ఆర్గనైజేషన్ వారి ఎం.శ్రీశైలం బృందం కళాజాతను ప్రదర్శించింది. పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తమ ప్రదర్శనతో తెలియజెప్పారు.

వృద్ధులకు అన్నదానం, పండ్లు పంపిణీ



తెనాలిటౌన్: నాజరు పేటలోని మన ఇల్లు వృద్ధాశ్రమం, గాంధీ నగర్‌లోని షిర్డీ సాయి ఆశ్రమంలో శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం సభ్యులు ఆదివారం అన్నదానం చేసి, పండ్లు పంపిణీ చేశారు. కొలకలూరు గ్రామానికి చెందిన ఎస్వీయోగ సభ్యులు కాలిశెట్టి నారాయణ రావు జ్ఞాపకార్థం భార్య నాగమల్లేశ్వరి, కుమారుడు శ్రీనివాసరావు సహకారంతో సేవా కార్యక్రమం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని కటెవరం గ్రామ మాజీ సర్పంచ్ గంపల శివనాగేశ్వరరావు ప్రారంభించారు. ఎస్వీ యోగ కన్వీనర్ ఎం.రమణయ్య, ఆశ్రమ నిర్వాహకులు మురళి, భారతి, సత్యనారాయణ, పలువురు యోగసాధకులు పాల్గొన్నారు.

దేవాలయాన్ని శుభ్రం చేసిన యోగ మండలి సభ్యులు



తెనాలిటౌన్: పట్టణ చినరావూరులోని శివాలయాన్ని శ్రీ ఆంజనేయం ధ్యాన యోగ మండలి సభ్యులు ఆదివారం శుభ్రం చేశారు. యోగ మండలి వ్యవస్థాపకులు కిషోర్ గురూజీ, యోగ సభ్యులు ఆలయంలో ఉన్న బూజు దులిపారు. కల్లాపు చల్లి, రంగవల్లులతో ఆలయ ప్రాంగణాన్ని తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా కిషోర్ గురూజీ మాట్లాడుతూ ఆలయ పరిశుభ్రత యోగంలో భాగంగా ప్రతి నెల ఒక దేవాలయాన్ని శుభ్రం చేయడం జరుగుతుందని తెలిపారు. ముంతా శ్రీనివాసరావు, తాడికొండ శ్రీనివాసరావు, కూరపాటి నాగరాజు, కోమల, నాగేశ్వరరావు, ముంతా లక్ష్మి, పురుషోత్తమ కృష్ణ, టీవీ సుబ్బారావు, యోగ సాధకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వివిధ అంశాల్లో శిక్షణ



తెనాలి: పట్టణ నెహ్రూరోడ్డులోని గ్రేడ్-1 శాఖ గ్రంథాలయంలోని వేసవి విజ్ఞాన శిబిరంలో ఆదివారం విద్యార్థులకు వివిధ అంశాలపై శిక్షణనిచ్చారు. అత్తోట జెడ్పీ హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు రాయపాటి శివనాగేశ్వరరావు సైన్స్ ప్రయోగాలు, విష్ణుమొలకల భీమేశ్వర రావు తెలుగు పద్యాలు, గేయాలలు, ఆళ్ల నాగేశ్వరరావు ఏరువాక పౌర్ణమి విశిష్టతమ తెలియజెప్పారు. రంగస్థల సంగీత దర్శకుడు బొల్లిముంత కృష్ణ పర్యావరణ గేయాలను నేర్పించారు. సోమవారం పర్యావరణ దినోత్సవం నిర్వహించి, విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ అంశంపై వక్తృత్వ పోటీలు జరుపుతామని, విజేతలకు బహుమతులు అందజేస్తామని లైబ్రేరియన్ కావూరి రమాదేవి తెలియజేశారు.

హైజంప్ పోటీల్లో రేటూరు యువకుడి ప్రతిభ



కాకుమాను: జాతీయ స్థాయిలో నిర్వహించిన హైజంప్ పోటీల్లో మండలంలోని రేటూరుకు చెందిన షేక్ మెహిద్దీన్(24)అత్యంత ప్రతిభ చూపాడు. ఏప్రిల్ 25 నుంచి ఈనెల మూడో తేదీ వరకు లక్నోలో జరిగిన పోటీల్లో పాల్గొని మూడో స్థానాన్ని పొందాడు. చిన్ననాటి నుంచి హైజంప్ అంటే ఇష్టపడే మెహిద్దీన్ మద్రాసుకు చెందిన గురువు దాము రతినం శిక్షణలో గతంలో అనేకసార్లు నిర్వహించిన జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటాడు. ఈ సందర్భంగా మెహిద్దీన్ మాట్లాడుతూ నేషనల్ స్థాయిలో ప్రథమ స్థానం సాధించడమే తన లక్ష్యమని పేర్కొన్నారు.

రజక వలంటరీ సర్వీస్ సొసైటీ సేవలు స్ఫూర్తిదాయకం

విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ సభలో ఎమ్మెల్యే శివకుమార్



ఉపకార వేతనాలు, వస్తువులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: విద్యార్థులకు ఉపకార వేతనాలతో సహా అవసరమైన పుస్తకాలను, వస్తువులను సమకూరుస్తూ రజక వలంటరీ సర్వీస్ సొసైటీ అందిస్తున్న సేవలు స్ఫూర్తిదాయకంగా ఉంటున్నాయని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అభినందించారు. సొసైటీ ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో 10వ తరగతిలో ఉత్తీర్ణులైన 101 మంది రజక విద్యార్థులకు ఉపకార వేతనాలు, నోట్ పుస్తకాలు, కాలేజీ బ్యాగులు, రీడింగ్ కుర్చీలు, డ్రెస్ మెటీరియల్స్, వాటర్ బాటిల్స్‌ను పంపిణీ చేశారు. సొసైటీ అధ్యక్షుడు పోతార్లంక ప్రసాద్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ సొసైటీ అందిస్తున్న సహకారంతో విద్యార్థులు కాలేజి విద్యలో రాణించాలని సూచించారు. దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకుని భవిష్యత్‌లో ఉన్నత స్థితికి చేరుకోవాలని, తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలను చేపట్టిందని గుర్తుచేశారు. నాడు-నేడు పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్ల స్థాయిలో తీర్చిదిద్దిందని వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహకారాన్ని యువత అందిపుచ్చుకోవాలని సూచించారు. వివిధ రంగాల ప్రముఖులు వైవీ రమేష్‌బాబు, పి.నారాయణరావు, వెంకటేశ్వరరావు, డాక్టర్ వినీల్, మధుబాబు, వల్లూరు మహాలక్ష్మీపతి, ధర్మరాజుల చెన్నకేశవులు మాట్లాడారు. సొసైటీ కార్యదర్శి పేటేటి శ్రీనివాస్, పోతార్లంక శ్రీనివాస్, నాంచారయ్య, కౌన్సిలర్లు పెదలంక లక్ష్మీలావణ్య, వీర్లపాటి విజయలక్ష్మి పర్యవేక్షించారు.

వడ్డేశ్వరంలో వేసవి విజ్ఞాన శిబిరం



తయారుచేసిన పేపర్ టోపీలు, పువ్వులను ప్రదర్శిస్తున్న చిన్నారులు

తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరంలో ప్రజాసంఘాల కార్యాలయంలో ఆదివారం వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఐద్వా, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రతినిధి వల్లభాపురపు ప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. చిన్నారులకు రంగు పేపర్లతో వివిధ రకాల పువ్వులు, గ్రీటింగ్ కార్డులు, న్యూస్‌పేపర్‌తో టోపీలు తయారు చేయడం, కాగితం ముక్కలను చించి వాటిని దండలాగా తయారు చేయడం నేర్పించారు. వివిధ రకాల పరిమాణాలు కలిగిన తాళ్లను సమానం చేయడం, కర్పూరాన్ని అరచేతిలో మండించడం వంటి వాటి వెనుక ఎటువంటి మ్యాజిక్ కానీ, మంత్రాలు కానీ లేవని వివరించారు. ప్రతి విద్యార్థి చిన్నప్పటి నుంచే శాస్త్రీయ దృక్పథాన్ని కలిగి ఉండాలని, నమ్మకాలకు, మూఢ నమ్మకాలకు మధ్య తేడాను తెలుసుకుని మంచి పౌరులుగా ఎదగాలని అన్నారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక తుళ్లూరు ప్రధాన కార్యదర్శి పి.అరుణ్‌కుమార్, జిల్లా నాయకులు ఆదినారాయణ, సభ్యులు శ్రీనివాసకుమారి, అమలశ్రీ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తులకు డయాలసిస్ సేవలు



సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్ రెడ్డి

పాత గుంటూరు: పేద, మధ్య తరగతి కిడ్నీ బాధిత రోగులకు అధునాతన డయాలసిస్ సేవలు అందించడమే లక్ష్యంగా రోటరీ, రెడ్ క్రాస్ సంయుక్తంగా సెయింట్ జోసెఫ్ హాస్పిటల్‌లో డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు రోటరీ క్లబ్ గవర్నర్ తెల రాజశేఖరరెడ్డి తెలిపారు. ఆదివారం హాస్పిటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గుంటూరు, పరిసర జిల్లాల కిడ్నీ వ్యాధిగ్రస్తులు డయాలసిస్ సెంటర్‌లో అందిస్తున్న సేవల్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. రెడ్‌క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ పి. రామచంద్రరాజు మాట్లాడుతూ అతి తక్కువ ఖర్చుతో అధునాతన కిడ్నీ డయాలసిస్ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో క్లబ్ అధ్యక్షుడు కాలేషావలి, కె.వి భాస్కరరావు, లక్ష్మీనారాయణ, అరుణ్‌కుమార్, వలంటీర్లు పాల్గొన్నారు.

మదర్సాలో హజ్ యాత్రికులకు ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డెప్యూటీ సీఎం అంజద్ బాషా, ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య తదితరులు

పెదకాకాని: నంబూరు సిరాజుల్ ఉలూం మదర్సాలో హజ్ యాత్రికుల బస కేంద్రాన్ని ఆదివారం డెప్యూటీ సీఎం అంజద్ బాషా పరిశీలించారు. హజ్ యాత్రికులను కలిసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 6న శిబిరాన్ని సందర్శించనున్న దృష్ట్యా అధికారులందరూ సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మదర్సాలో తాగునీటి సమస్యను సంబంధిత అధికారులతో మాట్లాడి ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పరిష్కరించారు.

భక్తిశ్రద్ధలతో ఏరువాక పౌర్ణమి పూజలు



వెనిగండ్లలో పూజలందుకున్న విఘ్నేశ్వరుడు



శలపాడులో బొడ్డురాయి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు

పెదకాకాని: ఏరువాక పౌర్ణమి పూజల్ని మండలంలోని వెనిగండ్లలో సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఏటా జూన్‌లో రైతులు ఎద్దు, ప్రభలతో ఆలయం వద్దకు చేరుకుని పూజలు నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. ఈ ఈ ఏడాది కూడా రైతులు, పిల్లాపాపలతో ఆదివారం సాయంత్రం వినాయకుని గుడి వద్దకు చేరుకుని ప్రదక్షిణలు చేసి ప్రత్యేక పూజలు చేశారు. పాడి పంటలు వృద్ధి చెందాలని మొక్కులు మొక్కారు. విఘ్నేశ్వరుడికి పుసుపు, కుంకుమ, పూలు, పండ్లు, కొబ్బరికాయలు, ఉండ్రాళ్ళు, పాయసం సమర్పించారు. అర్చకులు వాసు అన్నదాతల పేరిట గోత్రనామ పూజలు చేశారు.

చేబ్రోలులో...

మండలంలో ఏరువాక పౌర్ణమి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. నారాకోడూరు, శలపాడు, గొడవర్రు, కొత్తరెడ్డిపాలెం గ్రామాల్లో రైతులు ఎడ్లల్ని అలంకరించి వ్యవసాయ పనులు ప్రారంభానికి శ్రీకారం చుట్టారు. జ్యేష్ఠ శుద్ధ పౌర్ణమిని ఏరువాక పున్నమిగా పిలుస్తారు. ఏరు అంటే నాగలి, వాక అంటే దుక్కి దున్నడం. ఏరువాక పౌర్ణమి నుంచి పొలాలు దుక్కి దున్ని పనులు ప్రారంభిస్తారు. ఈ ఏడాది కూడా వర్షాలు సమృద్ధిగా కురిసి వ్యవసాయం పండుగగా మారాలని ఆకాంక్షిస్తూ శలపాడు, కొత్తరెడ్డిపాలెం తదితర గ్రామాల్లో గ్రామస్తులు సీతాలమ్మ తల్లికి అభిషేకాలు చేశారు.

ఫొటోగ్రఫీ పోటీలకు ఆహ్వానం

తెనాలి: ఆంధ్రప్రదేశ్ ఫొటోగ్రఫీ అకాడమీ త్రైమాసిక ఫొటోగ్రఫీ పోటీలను నిర్వహిస్తున్నట్లు అకాడమీ ప్రధాన కార్యదర్శి కానాల సుధాకరరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఫెస్టివల్స్' అంశంపై కలర్, మోనోక్రోమ్ విభాగాల్లో నిర్వహించే పోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, అయిదుగురికి మెరిట్ సర్టిఫికెట్లను అకాడమీ వార్షికోత్సవ సభలో ప్రదానం చేస్తారని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనేందుకు ఎలాంటి ఎంట్రీ ఫీజు లేదనీ, ఒక్కొక్కరు రెండు విభాగాల్లో నాలుగు ఎంట్రీలను పంపుకోవచ్చని వివరించారు. ఎంట్రీలను ఈ నెల 11లోగా పంపాలని తెలిపారు.

8న కొమ్మూరు ఉప సర్పంచ్ ఎన్నిక

కాకుమాను: మండలంలోని కొమ్మూరు గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నిక 8న నిర్వహించనున్నట్లు ఈవోపీఆర్డీ నాగానంద్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనివార్య కారణాల వల్ల వాయిదా పడిన పక్షంలో మరుసటి రోజు నిర్వహించి, ఫలితాన్ని కూడా ప్రకటించనున్నట్లు ఆయన తెలిపారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

పెదకాకాని: శివాలయానికి వచ్చిన యువకుడి అదృశ్యంపై కేసు నమోదైంది. స్థానిక శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో మొక్కులు చెల్లించుకునేందుకు పల్నాడు జిల్లా ఈపూరు మండలం కొండ్రమట్ల గ్రామానికి చెందిన సింగంశెట్టి హనుమంతరావు కుటుంబ సభ్యులతో వచ్చారు. మానసికస్థితి సరిగా లేని 19 సంవత్సరాలు కుమారుడు అజయ్ మధ్యాహ్నం కనిపించకుండా పోయాడు. చుట్టుపక్కల వెతికినా కనిపించలేదు. కుమారుడు అదృశ్యంపై సింగంశెట్టి హనుమంతరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

పోలేరమ్మ తల్లి ఉత్సవాలు

గుంటూరు రూరల్: మండలంలోని తురకపాలెంలో ఆదివారం గ్రామ దేవత శ్రీ పోలేరమ్మ తల్లి, పోతురాజు ఆలయ ఉత్సవాల్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు, బలిహరణ జరిగాయి. గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారికి పొంగళ్లు వండి నైవేద్యాలు సమర్పించారు.

ఏరువాక ప్రత్యేక పూజలు



తాడేపల్లిరూరల్: ఏరువాక పౌర్ణమి సందర్భంగా మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి ఆదివారం గేటు సెంటర్‌లో గల వినాయకుని గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతుబిడ్డకు ఏరువాక పౌర్ణమి అనేది ఎంతో విశిష్టమైనదని, పౌర్ణమి రోజు తమ ఇష్ట దైవాలను కొలుచుకుని తమ పంటపొలాల్లో అరకలు దున్ని వ్యవసాయ పనులు ప్రారంభిస్తారని, మన ప్రాంతంలో కూడా రైతులు ఏరువాక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అర్చకులు వెంకట భార్గవేశ్వరరావు (ఫణీంద్రరావు) ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కళ్యాణ్, సుబ్బు, కేళి వెంకటేశ్వరరావు, మేకా అంజిరెడ్డి, బాలకోటయ్య పాల్గొన్నారు.

అన్న కొడుకుపై దాడి

తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని ఉండవల్లిలో సోదరుల మధ్య ఉన్న ఆస్తి గొడవల్లో అన్న కొడుకుపై దాడిచేసిన సంఘటనపై తాడేపల్లి పోలీసులు ఆదివారం రాత్రి కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉండవల్లిలో నివాసముండే తాండ్ర కృష్ణ, తాండ్ర కిషోర్‌లు అన్నదమ్ములు. వీరిద్దరి మధ్య ఆస్తి వివాదాలు తలెత్తడంతో కిషోర్ ప్రతిరోజూ కృష్ణ కుటుంబ సభ్యులను దూషిస్తున్నాడు. ఇదే క్రమంలో జరిగిన గొడవలో కిషోర్‌ను కృష్ణ కొడుకు వెంకట దినేష్ దూషించాడు. అక్కడి నుంచి వెళ్లిపోయిన కిషోర్ తిరిగి మరలా వచ్చి కత్తి తీసుకుని వెంకట దినేష్‌పై దాడిచేశాడు. దాడిలో కిషోర్ ఎడమచేతికి గాయమైంది. ఈ సంఘటనపై వెంకట దినేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

ట్యాంకర్లతో నీటి సరఫరా



తాడేపల్లిరూరల్: ఎంటిఎంసి పరిధిలోని వడ్డేశ్వరంలో బకింగ్‌హామ్ కెనాల్ ఒడ్డున ఉన్న విద్యుత్ మోటార్ల నుంచి తాగునీరు సరఫరా కాకపోవడంతో ఆదివారం సచివాలయ ఇంజినీరింగ్ సిబ్బంది పర్యవేక్షణలో వాటర్ ట్యాంకర్ల ద్వారా పలు ప్రాంతాలకు తాగునీటిని సరఫరా చేశారు. సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ సతీష్ మాట్లాడుతూ బకింగ్‌హామ్ కెనాల్‌లో సాగునీరు లేకపోవడంతో భూగర్భజలాలు అడుగంటి బకింగ్‌హామ్ కెనాల్ ఒడ్డున ఏర్పాటు చేసిన విద్యుత్ మోటర్ల నుంచి తాగునీరు అందడం లేదని, నగర పాలక సంస్థ అధికారులకు సమాచారం ఇవ్వగా రెండు తాగునీటి ట్యాంకర్లు ఏర్పాటు చేసి ఇందిరా కాలనీ, ఎస్సీ కాలనీలకు తాగునీరు సరఫరా చేసినట్లు ఆయన తెలిపారు.

ఆకట్టుకున్న నృత్యాభినయం

పాత గుంటూరు: ఆర్. అగ్రహారం శివాలయం ప్రాంగణంలో రుద్ర కళాక్షేత్రం నాట్యాచార్య మాచిరాజు రాజేష్ ఆధ్వర్యంలో ఆదివారం గజ్జె పూజ సందర్భంగా విద్యార్థినుల కూచిపూడి నృత్యం ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. ఆలయ ఈవో పగడాల శివకోటేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నటరాజ స్వామి పూజ నిర్వహించారు. విద్యార్థినులు యద్దనపూడి విద్యాసాయి అమృత, కొల్లా కమలాదేవి, పసుపులేటి జాహ్నవి, ఆలపాటి అమృత సాయి, దంపూరి కేధన, కొల్లా వీణావాసవీలు పలు కీర్తనలకు కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించారు.

మంగళగిరి టికెట్ బీసీలకు కేటాయించాలి

బీసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు సొంటి నాగరాజు

తాడేపల్లిరూరల్: మంగళగిరి అసెంబ్లీ టికెట్ అన్ని రాజకీయ పార్టీలు బీసీలకే కేటాయించాలని రాష్ట్ర బీసీ సేన అధ్యక్షుడు సొంటి నాగరాజు అన్నారు. తాడేపల్లి బైపాస్ రోడ్డులో ఉన్న బీసీ సేన రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మంగళగిరి నియోజకవర్గంలో గ్రామ స్థాయి నుంచి బీసీ ప్రాతినిధ్యం తగ్గిందని అన్నారు. మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ ఏర్పాటుచేసినా ఎన్నికలు నిర్వహించకుండా కుటిల రాజకీయం చేశారని విమర్శించారు. మంగళగిరి నియోజకవర్గం పారిశ్రామికంగా అభివృద్ధి చెందలేదని అన్నారు. రానున్న ఎన్నికల్లో అన్ని రాజకీయపార్టీలు బీసీ అభ్యర్థులను నిలబెట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో నియోజవర్గంలో బీసీలను ఏకం చేసి రాజకీయపార్టీల వ్యూహాలను తిప్పి కొడతామని అన్నారు. మంగళగిరి కార్పొరేషన్ చేయడం వల్ల పేద, మధ్యతరగతి వారిపై పన్నుల భారం పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో రాష్ట్ర కో ఆర్డినేటర్ పరస రంగనాథ్, పట్టణ యువజన అధ్యక్షుడు ప్రసాద్, తాడేపల్లి పట్టణ యువజన అధ్యక్షుడు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణానికి శ్రీకారం



10 వార్డులో లెవలింగ్ పనులను పరిశీలిస్తున్న ఏఈ కిషోర్

తాడేపల్లిరూరల్: మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని డోలాస్‌నగర్‌లో రూ.2 కోట్ల వ్యయంతో పలురోడ్ల నిర్మాణానికి అధికారులు ఆదివారం శ్రీకారం చుట్టారు. ఏఈ కిషోర్ మాట్లాడుతూ 40 సంవత్సరాల నుంచి యర్రబాలెం, తాడేపల్లిలను కలుపుతూ ఉన్న రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. స్థానికులు ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి తీసుకురావడంతో ఎంటిఎంసి ప్రత్యేక నిధుల నుంచి రూ.50 లక్షలు కేటాయించి బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టామని, నులకపేట మసీదు వెనుక భాగంలో కొంత రోడ్డు నిర్మాణ పనులు జరక్కపోవడంతో అక్కడ కూడా కార్పొరేషన్ నిధుల నుంచి రూ.60 లక్షలు కేటాయించి రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నామన్నారు. మంగళగిరి తాడేపల్లి పాత జాతీయ రహదారి వెంబడి తేజ రెసిడెన్షియల్ వద్ద రూ.40 లక్షల వ్యయంతో సీసీ రోడ్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. శివదుర్గాపురం, నులకపేట తదితర ప్రాంతాల్లో మరో రూ.50 లక్షల వ్యయంతో డ్రెయిన్‌లు, గ్రావెల్ రోడ్ నిర్మాణాన్ని చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

రీ వెరిఫికేషన్ చేసి అనర్హుల పట్టాలు రద్దు చేస్తాం

తహసీల్దారు జీవీ రామ్‌ప్రసాద్

మంగళగిరి: ఇళ్ల పట్టాల మంజూరుపై రీ వెరిఫికేషన్ నిర్వహించి అనర్హుల పట్టాలు రద్దు చేస్తామని తహసీల్దార్ జీవీ రామ్‌ప్రసాద్ చెప్పారు. ఆదివారం యర్రబాలెంకు చెందిన నాగసీత కనకదుర్గ తాను ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలానికి అనర్హురాలని పట్టాను రద్దు చేసి వెనక్కు తీసుకోవాలని తహసీల్దార్‌కు రాత పూర్వకంగా తెలియజేసింది. ఈ నేపథ్యంలో తహసీల్దార్ మాట్లాడుతూ ఇళ్ల స్థలాల మంజూరులో అనర్హులకు పట్టాలు మంజూరై ఉంటే మరోసారి రీ వెరిఫికేషన్ చేసి పట్టా రద్దు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనర్హులను ఎంపిక చేసి తమను తప్పుదోవ పట్టించిన సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అర్హులందరికీ తప్పనిసరిగా ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడుస్తూ అనర్హులను ఎంపిక చేసిన సిబ్బందితోపాటు అనర్హులుగా ఉండి పట్టాలు పొందిన లబ్ధిదారులపైన ప్రభుత్వ నిబంధనల మేరకు చట్ట ప్రకారం చర్యలు తప్పవన్నారు. అనర్హులు ఇప్పటికే ఎవరైనా ఇళ్ల పట్టాలు పొంది ఉంటే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమకు తెలియజేయాలని కోరారు.

వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం



సుదర్శన హోమంలో పాల్గొన్న భక్తులు

పాత గుంటూరు: లాలాపేటలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం శ్రీదేవి, భూదేవీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామి గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. దేవస్థానం చైర్మన్ పిచ్చల జయప్రకాష్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్, ఈవో డి. శ్రీనివాసరావు, అర్చకులు ప్రసాద్, మురళీ చంద్రకుమార్, శ్రీనివాసచార్యులు నిర్వహణలో సుదర్శన హోమం నిర్వహించారు. సాయంత్రం మేళతాళాలు, బాజాభజంత్రీలతో నగర వీధుల్లో స్వామి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు విశాలక్ష్మి, వెంకట జ్యోతి, నరేష్ కుమార్, రామకోటేశ్వరరావు, వెంకటరత్నం, శ్రీనివాసులు, అనిత, శివకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు పోటీలు



పెయింటింగ్ వేస్తున్న చిన్నారులు

పాత గుంటూరు: ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని బ్రాడీపేటలోని బాలానంద కేంద్రంలో ఆదివారం శ్లోక హ్యూమానిటేరియన్ ఫౌండేషన్ జిల్లా కో-ఆర్డినేటర్ విజయగౌరి ఆధ్వర్యంలో చిన్నారులకు పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా కేంద్రం కార్యదర్శి ఎస్. వెంకట గురుదత్తు, ఇన్నర్ వీల్ అధ్యక్షురాలు నీలిమ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే దిశగా పోటీల్ని నిర్వహిస్తున్న ఫౌండేషన్ సేవలు అభినందనీయమని తెలిపారు.

పారా మెడికల్ సిబ్బందికి కనీస వేతనాలు చెల్లించాలి



సమావేశానికి హాజరైన రేడియోగ్రాఫర్లు

గుంటూరు మెడికల్: రేడియాలజీ వైద్య విభాగంలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనాలు చెల్లించాలని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ రేడియాలజికల్ టెక్నీషియన్స్ అసోసియేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. రవీంద్రబాబు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అరండల్‌పేటలో ఆదివారం అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ ప్రథమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్రబాబు మాట్లాడుతూ రెగ్యులర్ ఉద్యోగులకు మాదిరిగానే కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు 30 రోజుల రేడియేషన్ సెలవులు ఇవ్వాలని కోరారు. డార్క్ రూమ్ అసిస్టెంట్లను జూనియర్ రేడియోగ్రాఫర్స్‌గా మార్పు చేయాలని, సింగిల్ రేడియోగ్రాఫర్ ఉన్న సీహెచ్‌సీల్లో జూనియర్ రేడియోగ్రాఫర్‌ను నియమించాలని కోరారు. ప్రభుత్వం పెద్దమనస్సు చేసుకుని కాంట్రాక్ట్ , ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల్ని రెగ్యులర్ చేయాలని అభ్యర్థించారు. సమావేశంలో యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్. జీవన్ మనోజ్, అసోసియేట్ ప్రెసిడెంట్ కె. సత్యసుందరమూర్తి, రాష్ట్ర సెక్రటరీ బి. మణిబాబు, కోశాధికారి ఎల్.వి.బి.చారి, జిల్లా అధ్యక్షుడు వై. వరుణ్‌ప్రకాష్, వర్కింగ్ ప్రెసిడెంట్ పి. దేవకుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్ జి.ఎస్. సుధాకర్, సెక్రటరీ ఎం. అనిల్‌కుమార్, కోశాధికారి కె. రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తికి ఆర్థిక సాయం



ఎలక్ట్రీషియన్ మణికంఠకు ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

మంగళగిరి: విద్యుత్ లైన్లకు మరమ్మతులు నిర్వహిస్తూ ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న ఎలక్ట్రీషియన్‌కు నగరానికి చెందిన విజయ హెల్త్ కేర్ ట్రస్ట్, బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూ.20వేల ఆర్థిక సహాయం అందజేశారు. దుగ్గిరాల మండలం మంచికలపూడికి చెందిన మణికంఠ పొలంలో మరమ్మతులు నిర్వహిస్తూ ప్రమాదానికి గురయ్యాడు. శరీరం కాలి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సమాచారం అందుకున్న విజయ హెల్త్ కేర్ ట్రస్ట్, బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రూ.20వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్, విజయ హెల్త్ కేర్ ట్రస్ట్ ఫౌండర్ కాగితాల స్వాతి, బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఉడతా శ్రీనివాస్, ఆలా శివాజీ, తిరువీధుల కిరణ్, మాదు నాగదుర్గ, మధు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.